# బాలికోన్నత పాఠశాలకు రెండు వేల నోట్ పుస్తకాలు

### మండలి చైర్మన్ జన్మదిన వేడుకల్లో బహుమతులుగా వచ్చినవి పంపిణీ



**భీమవరం,మేజర్‌న్యూస్:** పి.ఎస్.ఎంబాలికోన్నత పాఠశాలకు ఉచితంగా రెండు వేలు నోటు పుస్తకాలు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అందజేశారు.శుక్రవారం స్థానిక రాష్ట్ర శాసనమండలి చైర్మన్‌క్యాంప్ కార్యాలయం నందు పి.ఎస్.ఎం బాలికోన్నత పాఠశాలకు రెండు వేలు నోటు పుస్తకాలను రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజు సమక్షంలోజిల్లాకలెక్టర్ పి.ప్రశాంతిసంబంధితపాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఇటీవల రాష్ట్ర శాసన మండలి చైర్మన్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ప్రజలు,అభిమానులు,స్థానిక నాయకులు పెద్ద ఎత్తున నోటు పుస్తకాలను ఆయనకు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. శాసనమండలి చైర్మన్ కోరిన మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా వాటిని పిఎస్ ఎం పాఠశాలకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలందరికీ అందజేసి సద్వినియోగం చేయాలని తెలిపారు.ఈసందర్భంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ యు. రవి ప్రకాష్, రాష్ట్ర అసెంబ్లీ సెక్రటరీజనరల్ పి.పి.కె రామాచార్యులు, డిఆర్ఓ బి.శివన్నారాయణ, ఆర్డీవో కె.శ్రీనివాసులు రాజు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.


17వ
నేటి దినపత్రిక
సూర్య
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
శనివారం,6 జనవరి 2024








# అర్హులైన 2,168 మందికి రూ.3.38 కోట్లు విడుదల

**- సిఎం వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్**

**ఏలూరు, మేజర్‌న్యూస్ :** జిల్లాలో (ఆగస్టు 2023–డిసెంబర్2023వరకు) బైయాన్యువల్ పథకం(ద్వై వార్షిక పథకం) ద్వారా 2,168 మంది లబ్ధిదారులకు రూ.3.38కోట్లుప్రభుత్వం విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు.ఆగస్టు, 2023 నుండి డిసెంబర్, 2023 వరకు అమలైన వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఏకారణం చేతనైనా లబ్ధి అందని 68,990 అర్హులకు రూ.97.76 కోట్ల ను శుక్రవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో బటన్‌నొక్కి లబ్ధిదారులఖాతాల్లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డిజమ చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు వర్చువల్ విధానంలో ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ , డిఆర్డి ఎపిడి ఆర్.విజయ రాజు,సంబంధిత అధికారులు,లబ్ధి దారులు, తదితరులు పాల్గొన్నారు.. దీనికి సంబంధించి మొత్తం 2168 మంది లబ్ధిదారులకు రూ.3 కోట్ల 37 లక్షల 90 వేల విలువైన చెక్కును జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్,ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ లబ్ధిదారులకు అందజేశారు.సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పథకం లబ్ధి అందించిన తర్వాత కూడా పొరపాటున ఏ కారణం చేతనైనా మిస్ అయిన వారికి మరో అవకాశం ఇవ్వడం జరుగుతుందన్నారు.జిల్లాలో బిసి కార్పొరేషన్ పరిధిలో వైఎస్ఆర్ ఇబిసి నేస్తం క్రింద 143 మందికి రూ.21.45 లక్షలు, వైఎస్ఆర్ కాపు నేస్తం క్రింద 102 మందికి రూ.15.30లక్షలు, జగనన్న చేదోడుక్రింద486మందికిరూ.48.60 లక్షలు, రవాణా శాఖ ద్వారా వైఎస్ఆర్ వాహన మిత్ర పథకం క్రింద 77 మందికి రూ.7.70 లక్షలు, మత్స్యశాఖ పరిధిలో మత్స్యకారభరోసా పథకం క్రింద ఒక్కరికి రూ.10,000 వేలు విద్యాశాఖ ద్వారా జగనన్న అమ్మ ఒడి పథకం క్రింద 1276 మందికిరూ.1.79కోట్లు,సాంఘిక సంక్షేమం ద్వారా వైఎస్ఆర్ కల్యాణ మస్తు, షాదీ తోఫా పథకం క్రింద 83 జంటలకు రూ.65.55 లక్షలు నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు.

# ఇంకెప్పుడు?

### చింతలపూడి(ఎస్‌సి) నియోజకవర్గ ఇన్చార్జి ఎవరో?

**ఏలూరు,సూర్యబ్యూరో :** నాలుగున్నర సంవత్సరాలు దాటినా,మళ్లీసాధారణ ఎన్నికల తేదీలు సమీపిస్తున్నా ఏలూరు జిల్లాలోని చింతలపూడి ఎస్‌సిరిజర్వుడు నియోజకవర్గానికి తెలుగుదేశంపార్టీఇన్చార్జిని నియమించలేకపోయిందనే చర్చఅ పార్టీలోనూ, రాజకీయ వర్గాల్లోనూ జోరుగా సాగుతోంది. ఇదిగో, అదిగోఅంటూ,సమీక్షా సమావేశాలు అంటూ, ఆశావహులతో సమావేశాలు సంయుక్తంగా, విడి విడిగా కూడా నిర్వహించినా, ఇంతవరకు నియోజకవర్గానికి ఇన్చార్జి ఎవరో, పార్టీ కార్యకర్తలు, నాయకులు పార్టీ వ్యవహారాలపై ఎవరని సంప్రదించాలో తెలియని అయోమయ వాతావరణంనెలకొంది.అయితే ప్రస్తుతానికి మాజీ శాసనసభ్యులు గంటా మురళీ రామకృష్ణ ఇన్చార్జిగా కొనసాగుతున్నారు. కానీ ఎస్ సి రిజర్వుడు నియోజకవర్గంలో ఎస్ సి సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని నియమించక పోవడం గమనార్హం. చింతలపూడి నియోజకవర్గం నుండి ఎన్నికల్లో పోటీ చేయడానికి లెక్క లేనంత మంది నాయకులు క్యూలో ఉన్నారు. కానీ చివరకు పార్టీ అధినాయకత్వంముగ్గురిపేర్లను తెరపైకి తీసుకువచ్చి, వారితో సంయుక్తంగా , విడివిడిగా మాట్లాడారు.వారిలో ఆకుమర్తి రామారావు, సొంగ రోషన్ కుమార్, బొమ్మాజీ అనిల్ ఉన్నారు.కానీ ఇంతవరకు ఏ విషయం అధినాయకత్వం తేల్చలేదు.పార్టీఅధినాయకత్వం ఈముగ్గురిఅభిప్రాయాలను స్వీకరించింది. చివరకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దగ్గరకు ఈ సమస్యను తీసుకెళ్లారు. ఆయన కూడా ఈ ముగ్గురు నాయకులతోమాట్లాడి, తాముత్వరలోనేపార్టీనియోజకవర్గఇంచార్జిని నియమిస్తామని, ఎవరని నియమించినా పార్టీ విజయానికి అందరూ కృషి చేయాలని ఆదేశించారు. కానీ ఇంతవరకు ఎవరినీ నియమించలేదు. ఏ విషయమూ ఇప్పటికీ తేల్చలేదు. కానీ రోజుకొక పేరు తెరపైకి వస్తుండడంతో పార్టీ కేడర్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. గ్రామస్థాయి నుండి పార్టీ కేడర్ బలంగా ఉన్న తెలుగుదేశం పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 15 స్థానాల్లో ఒక్క చింతలపూడి విషయంలోనే ఎటూ తేల్చలేక పోవడం గమనార్హం.తెలుగుదేశం నియోజకవర్గ ఇన్చార్జి ఎవరో ఇప్పటికీప్రకటించకుండాపార్టీ రాష్ట్రనాయకత్వం అయోమయంలో ఉండి, చింతలపూడి నియోజకవర్గ పార్టీ నాయకులను,కేడర్‌ను కూడా అయోమయానికి గురి చేయడం గమనార్హం.





# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**- జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి**

**భీమవరం,మేజర్‌న్యూస్:** జల్లెడ పట్టి మరీ సంక్షేమ పథకాలు అర్హతే ప్రామాణికంగా మంజూరు చేసి జిల్లాలో 2,439 మందికి రూ 3.78 కోట్ల లబ్ధి చేకూరిందని జిల్లాకలెక్టరుపి.ప్రశాంతి అన్నారు. అర్హతే ప్రామాణికంగా జల్లెడ పట్టి మరీ లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోంది.వివిధకారణాలవల్ల సంక్షేమ పథకాలు అందకుండా మిగిలి పోయిన లబ్ధిదారులను గుర్తించి వారికి ప్రతి ఆరునెలలకు ఒకసారి వివిధ పథకాలను మంజూరు చేస్తోంది. అర్హత ఉన్నవారు ఏ ఒక్కరు కూడాపథకాలకు దూరం కాకూడదన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఇలా ఇప్పటివరకు ఐదు సార్లు ప్రభుత్వం మిగిలిపోయినలబ్ధిదారులకు పథకాలను విడుదల చేసింది.దీనిలో భాగంగా జిల్లాకు చెందిన 2,439 మంది లబ్ధిదారులకు రూ 3.78 కోట్లు విలువైన పథకాలను ముఖ్యమంత్రి జగన్‌శుక్రవారం విడుదల చేశారు.తాడేపల్లిలోజరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదుజమచేశారు.ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం చేశారు. జిల్లా నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరు పి.ప్రశాంతి, శాసన మండలి సభ్యులు కవురు శ్రీనివాస్, సంబంధిత అధికారులు, వివిధ పథకాలకు చెందిన లబ్ధిదారులు పాల్గొని తిలకించారు.జిల్లాలో బిసి కార్పొరేషన్ పరిధిలో వైఎస్ఆర్ ఇబిసి నేస్తం క్రింద 129 మందికి రూ 19.35 లక్షలు, విద్యాశాఖ ద్వారా జగనన్న అమ్మ ఒడి పథకం క్రింద 1524 మందికి రూ 2.11 కోట్లు, జగనన్న చేదోడు క్రింద 452 మందికి రూ 45.20 లక్షలు, సాంఘిక సంక్షేమం ద్వారా వైఎస్ఆర్ కల్యాణ మస్తు, షాదీ తోఫా పథకం క్రింద 94 జంటలకు రూ.68.55 లక్షలు, వైఎస్ఆర్ కాపునేస్తం క్రింద 148 మందికి రూ.22.20 లక్షలు, మత్స్యశాఖ పరిధిలో మత్స్యకార భరోసా పథకం క్రింద 24 మందికి రూ 2.40 లక్షలు, చేనేత జౌళిశాఖ ద్వారా వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం క్రింద ఒక్కరికీ రూ.24 వేలు, రవాణా శాఖ ద్వారా వైఎస్ఆర్ వాహనమిత్ర పథకం క్రింద 67 మందికి రూ.9.60 లక్షలు నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా సంబంధించి మొత్తం 2,439 మంది వివిధ పథకాల లబ్ధిదారులకు రూ 3.78 కోట్లు విలువైన నమూనా చెక్కును జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు కవురు శ్రీనివాస్, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్ అప్పారావు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నాయుడును కలిసిన అభిమానులు



**నర్సాపురం, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశంపార్టీ యువ నాయకుడు, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడును స్థానిక స్టేషన్ పేటకు చెందిన అభిమానులు శుక్రవారం ఆయన నివాసంలో కలిశారు. త్వరలో జరగబోయే ఎన్నికలలో నాయుడు తెలుగుదేశం పార్టీ తరఫున టికెట్ ఆశిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గత రెండు రోజులుగా నియోజకవర్గంలోని పలువురు అభిమానులు నాయుడుని కలిసి మద్దతు తెలుపుతున్నారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ పెద్ద ఎత్తున అభిమానులు కలవటం ప్రాధాన్యత సంతరించుకుంది. నాయుడును కలిసిన వారిలో వడ్డి ఆకేష్, కొల్లాబత్తుల నరసింహారావు, దీపాటి విక్రమ్, ముప్పాతిక మోజెస్, కర్రిపోతుల ఏసురత్నం, దీపాటి జయరాజు తదితరులు ఉన్నారు.

# జగన్ పాలనలో బడుగులకు పెద్దపీట

### ఏఎంసి నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే డిఎన్ఆర్,ఎమ్మెల్సీ జయ మంగళ





**కైకలూరు,మేజర్‌న్యూస్:** కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి నాలుగు మండలాల నుండి అభిమానులు నాయకులు తరలివచ్చారు. స్థానిక ట్రావెల్స్ బంగ్లా దగ్గర నుండి పెద్ద ఎత్తున ర్యాలీగా వెళుతూ కూరగాయలు మార్కెట్ దగ్గర వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు తో కలిసి జయ మంగళ వెంకటరమణ ఎమ్మెల్సీ పాల్గొన్నారు..మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గా చేబోయిన వీర్రాజు, వైస్ చైర్మన్ ఉచ్చుల చినరాజు,కమిటీ సభ్యులతో మార్కెట్‌యార్డ్‌సెక్రెటరీప్రమాణం చేయించారు. ఎమ్మెల్యే నాగేశ్వరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు ప్రాధాన్యత కల్పించిన నేపథ్యంలో కైకలూరు నియోజకవర్గం నుండి బడుగు బలహీన వర్గాలకి న్యాయం జరిగే విధంగా పదవులు కేటాయించామని అన్నారు. ఈ కార్యక్రమంలో కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్,నాలుగు మండలాల ఎంపీపీలు జడ్పీటీసీలు ఎంపీటీసీలు గ్రామ సర్పంచులు అభిమానులు నాయకులు పాల్గొన్నారు.

# సొసైటీ డిపాజిట్ దారులందరికీ న్యాయం



**టి.నరసాపురం,మేజర్‌న్యూస్:** టి.నరసాపురం సొసైటీలో డిపాజిట్ దారులందరికి రెండు,మూడు నెలల్లో న్యాయం చేస్తామని కో– ఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రార్ యం రవికుమార్ తెలిపారు. స్థానిక సొసైటీ వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాతూ డిపాజిట్ దారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే బాధ్యులకు చెందిన ఆస్తులను జప్తు చేశామని, డిక్రీ పొందిన అనంతరం వాటిని వేలం ద్వారా విక్రయించిన నగదుతో పాటు రైతులు రుణాలు పొంది కాలం గడిచినా చెల్లించని నగదు వసూలు చేసి, డిపాజిట్ దారులకు చెల్లిస్తామన్నారు. ఇందుకోసం పీఏసీఎస్ సిబ్బందిని రైతులు నుంచి రుణాలు వసూలు చేసేందుకు నియమించామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డివిజనల్ కోఆపరేటివ్ అధికారి మోహన్ బాబు, సొసైటీ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

# ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ పిప్రశాంతి**



**భీమవరం, మేజర్‌న్యూస్ :** రానున్న ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.శుక్రవారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి సంయుక్తంగా వివిధ రెవెన్యూ అంశాలపై జిల్లాస్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎఎన్నికలు, రీ సర్వే, సమిత్వ, స్టోన్ ప్లాంటేషన్, ఇనామ్ భూములు, ఫ్రీ హోల్డ్ భూములులో ఉన్న పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫైనల్ ఆర్ వో ఆర్, కరెక్షన్ మోడల్, ఫొటోస్ అప్డేషన్ వంటి అంశాల్లో శ్రద్ధ వహించాలన్నారు. ఎఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేయబడిన పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలులో నాడు – నేడు కార్యక్రమం ద్వారా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని. ఈనెల 5వ తేదీ నుండి 10వ తేదీ వరకు రీసర్వే కు సంబంధించిన గ్రీవెన్స్ స్వీకరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. 17వ తేదీ నుండి 21వ తేదీ వరకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి టెక్నికల్ సమస్యలు లేనివి వెంటనే క్లోజ్ చేయాలని ఆదేశించారు. టెక్నికల్ సమస్యలు ఉన్న వాటిని రాష్ట్ర కార్యాలయానికి పంపాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఆర్డీవోలు కె.శ్రీనివాసులు రాజు, ఎం.అచ్యుత్ అంబరీష్, కె.చెన్నయ్య డిప్యూటీ ట్రైనీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్, మండల తహసిల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్లు, మండల సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

# 31న భీమవరంలో ఎమ్మెల్సీల సదస్సు

**- రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు**



**భీమవరం,మేజర్‌న్యూస్ :** శాసనమండలిలో ఎమ్మెల్సీలు పాటించవలసిన విధి,విధానాలపై భీమవరంలో ఎమ్మెల్సీల రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర శాసన మండల చైర్మన్ కొయ్యేమోషేన్‌రాజ్‌తెలిపారు.శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని శాసనమండలి చైర్మన్‌క్యాంపు కార్యాలయం నందు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, జిల్లా ఎస్పీ యు.రవి ప్రకాష్ లతో కలిసి ఎమ్మెల్సీల సదస్సు నిర్వహణపై సమీక్షించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యేమోషేన్‌రాజ్ మాట్లా డుతూ శాసనమండలి విధి, విధానాలు, క్వశ్చన్‌అవర్,షార్ట్ డిస్కషన్స్, సభలోసభ్యులు వ్యవహరిం చవలసిన తీరు, అనుసరించవలసిన నిబంధనలు, సూచనలు, తదితర అంశాలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎమ్మెల్సీలతో సదస్సును నిర్వహించడం జరుగుతుందన్నారు.సదస్సునిర్వహణకు భీమవరం బివి రాజు కాలేజ్ (విష్ణు కాలేజ్) ను పరిశీలిస్తున్నట్లుతెలిపారు.చాలాసంవత్సరాలక్రిందట ఇటువంటి సదస్సును నిర్వహించడం జరిగిందని, ఇప్పుడు పశ్చిమగోదావరిజిల్లాభీమవరంలో నిర్వహించడానికి ఆలోచనచేయడం జరిగిందన్నారు. సదస్సు నిర్వహణ ప్రాంతంలో బందోబస్తు, పట్టణంలో పారిశుద్ధ్యం నిర్వహణ, అతిథులకు ఆహ్వానం, అతిథి మర్యాదలు, స్థానికంగాఉన్న చర్చి, మసీదు, దేవాలయంలలో దర్శనం, ఆశీర్వచనం ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంజరిగింది.ఈసమావేశంలో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ యు. రవి ప్రకాష్, రాష్ట్ర అసెంబ్లీసెక్రటరీజనరల్‌పి.పి.కె రామాచార్యులు,జాయింట్ సెక్రెటరీ విజయ రాజు, సహాయ కార్యదర్శిలు శ్రీనివాసరావు,విశ్వనాధ్, పశ్చిమ గోదావరి డిఆర్ఓ బి.శివన్నారాయణ, భీమవరం ఆర్డీవో కె.శ్రీనివాసులురాజు, మున్సిపల్ కమిషనర్ కె.శ్యామల పాల్గొన్నారు.

# క్రీడలతో ఆరోగ్యం - ప్రశాంతత

**- పోలీస్ క్రీడోత్సవాలను ప్రారంభించిన జిల్లా ఎస్పి ప్రశాంతి**







**ఏలూరు, మేజర్‌న్యూస్ :** ఏలూరు జిల్లా ఎస్పీ డి మేరీ ప్రశాంతి ఆదేశాలపై ఈనెల 5,6 తేదీలలో ఏలూరు జిల్లా అదనపు పోలీస్ స్పోర్ట్స్ సెలెక్షన్ లో భాగంగా మొత్తం 20 ఆటలలో పోటీలు నిర్వహిస్తారన్నారు. ఏలూరు స్థానిక పోలీసు పరేడ్ మైదానం, ఏలూరు జిల్లా స్థాయి పోలీసు స్పోర్ట్స్ సెలెక్షన్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం వద్ద గల పోలీసు పరేడ్ మైదానంలో జిల్లా ఎస్పీ డి మేరీ ప్రశాంతి జండా ఊపి జిల్లా స్థాయి పోలీసు స్పోర్ట్స్ సెలెక్షన్ ను ప్రాంభించారు. పోలీసు సిబ్బంది గౌరవ వదనం ఎస్పి స్వకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది 24/7 ఉద్యోగ నిర్వహణలో అలసట లేకుండా విధి నిర్వహణలో నిమగ్నమయి వారి ఆరోగ్యం పట్ల అశ్రద్ధ జరుగుతున్న విషయంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి కె.వి రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాలపై ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు, క్రీడలు ఆరోగ్యంనకు చాలా మంచివి, మనసు ప్రశాంతత ఉల్లాస పరుస్తూ ఆనందనిస్తాయని, అందరికి క్రీడలు పట్ల అవఘాహన కలిగి ఉండాలని, సంవత్సరానికి ఒక్కసారి అయిన ఇటువంటి క్రీడ పోటీలను ఏర్పాటు చేయడం వలన సిబ్బంది అందరికి ఉత్సహము వస్తుంది అని అన్నారు. జిల్లా స్థాయి పోలీసు స్పోర్ట్స్ మీట్ లో ప్రతిబా చూపిన వారికి రాష్ట్ర పోలీసు స్పోర్ట్స్ మీట్ లో స్థానము కల్పిస్తాము అని ఎస్పి ఈ సందర్భంగా తెలిపారు. ఈ జిల్లా పోలీసు స్పోర్ట్స్ మీట్ నందు కబాడి, వాలీబాల్, అథ్లెటిక్, హాకీ,100 మీ , 400 మీ, 800 మీ, హై జంప్, లాంగ్ జంప్, ఫుట్ బాల్, టెన్నిస్, షటిల్ , ఇతర క్రీడలను అధికారులు లకు , సిబ్బందికి వేరు వేరుగా మరి కొన్ని విభాగాలలో కలిపి , పురుష, స్త్రీవిభాగాలలో పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ ఎన్ సూర్య చంద్ర రావు, అదనపు ఎస్.పి .ఏ.ఆర్. ఎస్.ఎస్.శేఖర్, ఏలూరు డిఎస్పీ ఏలూరు డిఎస్పీ శ్రీనివాసులు, ఏ.అర్ డిఎస్పీ బి. చంద్ర శేఖర్,ఎస్.బి, సి.ఐ.బి.అది ప్రసాద్, అర్. ఐ పవన్ కుమార్, మహిళా ఎస్ఐలు కాంతి ప్రియ నిహారికలు, ఐ.టికోర్ ఇంఛార్జి నరేంద్ర, పోలీస్ అదికారులు, పోలీసు సిబ్బంది హాజరయ్యారు.


సంక్రాంతి శుభాకాంక్షలతో..
క్రాఫ్ట్ బజార్
చేనేత వస్త్ర హస్తకళా ప్రదర్శన మరియు అమ్మకం
సమయం: ఉదయం 11 గం॥ నుండి రాత్రి 9.30 వరకు
ఈ ప్రదర్శనలో
- ఖాదీ వస్త్రములు
- బెంగాలీకాటన్ చీరలు
- సారన్‌పూర్ ఉడ్ ఐటమ్స్
- ఇమిటేషన్ జ్యూవెలరీ
- వరంగల్ టవల్స్
- కలంకారీ డ్రస్సులు
తయారీదారులచే నేరుగా అమ్మకం
- జైపూర్ బెడ్‌షీట్స్
- లెదర్ క్రాఫ్ట్
- కాశ్మీర్ టాప్స్
- రెడీమేడ్ డ్రస్సులు
ఇంకా మరెన్నో వేలాది ఐటమ్స్
వేదిక :
టి.టి.డి కళ్యాణమండపం,
కొత్తబస్టాండ్ దగ్గర, ఏలూరు

సూర్య

పశ్చిమ గోదావరి

శనివారం

6 జనవరి 2024

2

## లేస్ పార్క్‌ను సందర్శించిన ఎండి వినోద్ కుమార్



**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఎండీ అండ్ సి. ఈ. ఓ శ్రీ వి.వినోద్ కుమార్ శుక్రవారం మండలంలోని సీతారాంపురంలో గల లేస్ పార్కును సందర్శించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకము ద్వారా ట్రైనింగ్ తీసుకుంటున్న మహిళలతోతో ఎండి మాట్లాడారు.అనంతరం ఎండి సంబంధిత సిబ్బందితో సమీక్ష నిర్వహించిపలు సూచనలు చేసారు.లేసు పార్క్ అభివృద్ధి కొరకు సంస్థ తరపున చేయవలసిన అన్ని చేస్తానని హామీ ఇచ్చారు.యూనివర్స్‌లో రిజిస్టర్ చేస్తామని చెప్పారు. యూనివర్స్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయవలసిందిగా డిస్టిక్ మేనేజర్ కి ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమానికి డిఆర్డిఏ డిపిఎం శ్రీనివాసులు డి ఎస్ డి ఓ ఏ కృష్ణారెడ్డి,లేస్ పార్క్ సిసి రమేష్, ఏ. పి. యస్. యస్. డి. సి. సిబ్బంది హాజరైనారు.

## వ్యాపారవేత్త కృష్ణకుమాతృవియోగం



**నర్సాపురం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పూల వ్యాపారి బల్ల కృష్ణ మాతృమూర్తి సీతామహాలక్ష్మి (75) శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు కృష్ణ నరసాపురం ప్రాంతంలో పూల వ్యాపారం చేస్తూ ఉంటారు. సీతామహాలక్ష్మి మృతితో చినమామిడిపల్లిలో విషాదఛాయలు అలు ముకున్నాయి. ఆమె మృతదేహాన్ని చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజానీకం, పరిసర ప్రాంత ప్రముఖులు హాజరయ్యారు. ఎన్నో సేవా కార్యక్రమాలను బల్ల కృష్ణ కుటుంబం చేస్తుంది. వీరిని పలువురు రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు వారి నివాసంలో కలిసి పరామర్శించారు.

# జిల్లా సమగ్ర అభివృద్ధి సదస్సు జయప్రదం చేయాలి




**– సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి రవి విజ్ఞప్తి**

**ఏలూరు, మేజర్‌న్యూస్ :** జనవరి 9వ తేదీన జరిగే జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.స్థానిక పవర్ పేటలో గల ఉద్దరాజు రామం భవనంలో శుక్రవారం జిల్లా సమగ్ర అభివృద్ధి సదస్సు కరపత్రాలు ఆవిష్కరణ జరిగింది.

ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ 9వ తేదీన ఉదయం 11 గంటలకు ఆర్.ఆర్.పేటలో గల శ్రీ కాశీవిశ్వేశ్వర కళ్యాణమండపంలో ఏలూరుజిల్లా సమగ్రాభివృద్ధి పేరుతో జరుగే సదస్సులో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లాలో ఉన్న వనరులు, అవకాశాలు, వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక విడుదల చేస్తామని చెప్పారు. జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ వి. శ్రీనివాసరావు, ఎం.ఎల్.సి.లు శ్రీ కె.లక్ష్మణరావు, శ్రీ.ఐ.వెంకటేశ్వరావు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర నాయకులు, జిల్లా ప్రముఖులు, మేధావులు పాల్గొని తమ అభిప్రాయలు, సలహాలు అందచేస్తారన్నారు.

ఈ కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. కిషోర్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రామకృష్ణ, పాల్గొన్నారు. చేతి వృత్తి దారుల జిల్లా సమన్వయకర్త పి. ఆదిశేషు, ఆఫీస్ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

# కొల్లేరు పర్యావరణ ప్రాంతాన్ని నిర్ధారించాలి





**– జిల్లా కలెక్టర్ : హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అధికారులు**

**ఏలూరు, మేజర్‌న్యూస్ :** కొల్లేరు 05 కాంటూరు చుట్టూ సున్నిత పర్యావరణ ప్రాంత నిర్ధారణ కొరకు ఏలూరు జిల్లా కలెక్టరు కార్యాలయంలోని గౌతమి సమావేశ మందిరంలో సదరు కమిటీ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ వారి అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగినది. ఈ సమావేశంలో జిల్లాలోని సున్నిత పర్యావరణ ప్రాంతం పరిధిలోనికి వచ్చు 9 మండలాలలోని 89 గ్రామాల గురించి మండల కేంద్రాలలో నిర్వహించిన గ్రామ సభల ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయాలు, సంబంధిత నియోజక వర్గాల ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు, వివిధ ప్రభుత్వ శాఖల అభిప్రాయాలు, సూచనలపై చర్చించడం జరిగినది. సమావేశంలో డివిజనల్ అటవీ శాఖాధికారి, వన్యప్రాణి యాజమాన్య విభాగము, ఏలూరు వారు ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై సభ్యులకు తెలియజేశారు. కమిటీ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సమావేశమునకు హాజరైన మానిటరింగ్ కమిటీ సభ్యులకు, హాజరైన ప్రజా ప్రతినిధులకు సవివరంగా సున్నిత పర్యావరణ ప్రాంతం, మౌళిక విషయాలను, పరిధి ప్రతిపాదనలను తెలిపారు. దీనిపై కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు, వారి అభిప్రాయాన్ని వివరించారు. తదుపరి ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ చివరిగా కొల్లేరు ౦5 కాంటూరు నుండి 1 కిలో మీటరు పరిధిని ప్రతిపాదించారు. దీనిపై అధికారులు 1 కిలో మీటరు పరిధి ప్రతిపాదించినట్లైతే ఈ ప్రతిపాదనలు ఎంతవరకు సఫలీకృతమవుతాయోనని అనుమానం వ్యక్తం చేసారు. ఎందుకనగా 010 కాంటూరు వరకు జాతీయ ప్రాముఖ్యత కలిగిన రాంసార్ ప్రాంతంగా 2002లో కేంద్రప్రభుత్వం ప్రకటించిన కొల్లేరు పరిధి 010 కాంటూరును ప్రామాణికంగా తీసుకుని నిర్ణయించడమైనది. ఈ సమావేశంలో కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ, కమిటీ మెంబర్ కన్వీనర్, డివిజనల్ అటవీ శాఖాధికారి, వన్యప్రాణి యాజమాన్య విభాగము, ఏలూరు ఎస్. రవిశంకర్, జిల్లా అటవీ శాఖాధికారి రవీంద్ర ధామా, ఇతర కమిటీ సభ్యులు తమ అభిప్రాయములు తెలియజేశారు.

## వినియోగదారుల హక్కులపై అవగాహన

**– జెసి ఎస్ రామ్ సుందర్ రెడ్డి**




**భీమవరం, మేజర్‌న్యూస్ :** వినియోగదారుల హక్కుల పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలనీ జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టరేటు స్పందన సమావేశ మందిరంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సంబంధిత అధికారులు, వినియోగదారుల ఉద్యమ సభ్యులు , విద్యార్థిని, విద్యార్థులు, తదితరులతో జిల్లా జాయింటు కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ అన్ని రంగాల్లో వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు రోజురోజుకు విస్తరిస్తున్నాయని, నాణ్యత విషయంలో లోపాలు ఉంటే సామాన్యమైన వ్యక్తి కూడా ప్రశ్నించే స్థాయిలో ఉన్నప్పుడే సమస్యలు తెలుస్తాయని అప్పుడే పరిష్కారంకు మార్గం ఏర్పడుతుందన్నారు. వినియోగదారుల రక్షణకు అధిక ప్రాధాన్యమిస్తూ వారి హక్కులను మరింత శక్తివంతం చేసేందుకు రూపొందించబడిన వినియోగ దారుల రక్షణ చట్టం సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాణ్యత లేని వస్తువులను విక్రయించడం, కల్తీలకు పాల్పడడం, వాస్తవ దూర మైన ప్రకటనలతో వినియోగ దారులను తప్పుదోవ పట్టించడం, వ్యాపారస్తుల అనైతిక పోకడలకు అడ్డుకట్ట వేసి వినియోగదారుల ప్రయోజనాలను ఈ చట్టం కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజరు టి.శివరామ ప్రసాదు, డియస్ వో యన్. సరోజ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.డి మహేశ్వర రావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఎ. సుందర రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ కమిషనర్‌ను సత్కరించిన ప్రజా ప్రతినిధులు



**నర్సాపురం,మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహించినఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాల శుక్రవారం ముగిసాయి. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీ వెంకట రమణ,కౌన్సిలర్ లు హాజరయ్యారు.అర్బన్ నుండి 15 సచివాలయాల 307 టీమ్స్, 173 మ్యాచ్లు 3,070 మంది క్రీడాకారులు పాల్గున్నారు.ప్రతి సచివాలయంనుండి బెస్ట్ ప్లేయర్సీని సెలక్షన్ చేసి 57 మంది పురుషులు, 57 మంది స్త్రీలను మొత్తం1710.మందిని మండల స్థాయికి ఎంపిక చేశారు.ఈ క్రీడాకారులనుఅభినందించారు.ఆడుదాం ఆంధ్రాక్రీడా సంబరాలు విజయవంతానికి విశేష కృషి చేసిన మున్సిపల్ కమీషనర్ డాక్టర్ కె వెంకటేస్వరరావుని చైర్ పర్సన్, ఇతర ప్రజా ప్రతినిధులు సత్కరించారు. సచివాలయంసిబ్బంది పిఈటిలను అభినందించారు.

## జి.కొత్తపల్లిలో ఆడదాం ఆంధ్ర కార్యక్రమం



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో ఆడదాం ఆంధ్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువనేత బొండాడ వెంకన్న బాబు మండల ప్రజాప్రతినిధులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ఆడుదాం ఆంధ్ర క్రీడలను ప్రారంభించారు.ఆడుదాం ఆంధ్ర పేరుతో నిర్వహించనున్న క్రీడా సంబరాలు చక్కటి స్ఫూర్తిని నింపేలా సాగాలని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులనువెలికి తీయడానికి ఇవి ఉపయోగపడాలని వెంకన్న బాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్షియల్ కార్యదర్శి చెలికాని రాజబాబు, మండల కన్వీనర్ ప్రతాపనేని శ్రీనివాసరావు, సర్పంచ్ కస్సె శ్రీహరి,ఎంపీటీసీ, మండల అధికారులు,నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, ప్రజా ప్రతినిధులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## హై స్కూల్ విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న దాత ఎన్ఆర్ఐ లెనిన్



**భీమడోలు, మేజర్ న్యూస్:** సమాజ అభివృద్ధి కోసం విద్య ఉపయోగపడుతుందని దీనిలో భాగంగా బాలికా విద్యను ప్రోత్సహించవలసిన అవసరం ఉందని, కార్యక్రమానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని సిఐటియు జిల్లా అధ్యక్షులు. ఆర్.లింగరాజు తెలిపారు. విద్య కోసం దూర ప్రాంతాల నుంచి నడకన, ఇతర మార్గాల ద్వారా పలువురు విద్యార్థినులు భీమడోలు హై స్కూల్ కి వస్తున్నారు. ఈ క్రమంలో వారి ఇబ్బందులను గమనించిన సిఐటియు జిల్లా అధ్యక్షులు తన సమీప బంధువు, ఎన్ఆర్ఐ సరికొండ లెనిన్ బాబు దృష్టికి సమస్యను తెచ్చారు. దీనిపై . సరికొండ లెనిన్ బాబు స్పందించారు. గతంలో భీమడోలు తో పాటు దాని పరిసర ప్రాంతాల్లో బాలికా విద్య అభివృద్ధి కోసం తను అందజేసిన వందలాది బాలికల సైకిళ్ల కు అదనంగా తాజాగా మరొక ఐదు సైకిళ్ల ను అందజేసేందుకు సంసిద్ధత ను వెలిబుచ్చారు . ఈ సైకిళ్లు. ను భీమడోలు హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో లింగరాజు చేతుల మీదుగా పాఠశాల యాజమాన్యానికి అప్పగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ,బాలికా విద్యను ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందని ,భవిష్యత్తులో వారు ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు సహకరిస్తుందని పేర్కొన్నారు. అనంతరం దాత తరఫున లింగరాజు ,పాఠశాల యాజమాన్యం తరపున ప్రధానోపాధ్యాయులు ఎంపిక చేసిన బాలికలకు సైకిళ్ళను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తోపాటు పాఠశాలకు చెందిన పలువురు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది హాజరయ్యారు.

## డ్రైనేజీ త్రవ్వారు - ఏడాదైనా పూర్ధకపోవడంతో వ్యాపారస్తుల ఇబ్బందులు



**ఏలూరు, మేజర్‌న్యూస్ :** స్థానిక శనివారపు పేట పాత తివాసి ప్రాంతంలో వ్యాపారాలు లేక వెలవెలబోతున్న షాపింగ్ కాంప్లెక్స్ లు, అయోమయంలో. వ్యాపారస్తులు. ఏలూరులోని 26వ డివిజన్ శనివారం పేట ప్రాంతంలో గత సంవత్సరం ఏప్రిల్ నెలలో నూతన డ్రైనేజీ కట్టడం కోసం రోడ్డు వెంబడి పాత డ్రైనేజీ తవ్వారు. ఏడాదికావవస్తున్నా ఇప్పటికీ అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు గాని కన్నెత్తైనా చూడలేదు అంటున్నారు వ్యాపారస్తులు. షాపుల అద్దెలు కట్టుకోలేక, కరెంట్ బిల్లులు చెల్లించలేక వ్యాపారాలు లేక నష్టపోతున్నామని నెల, నెల అద్దెలు చెల్లించటానికి అప్పు చేసిన వారి దగ్గర వడ్డీలు చెల్లించవలసి వస్తుందని, బ్యాంకు ఋణాలు కూడా కట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి డ్రైనేజీలు పూర్తిచేసి మార్గాన్ని వేస్తే గాని వ్యాపారాలు కొనసాగించలేమని తెలిపారు. డ్రైనేజీ తవ్వటం వలన డ్రైనేజీ లో నీరు బయటకు వచ్చి దుర్గంధం వెదజల్లుతోందని, తద్వారా ఈ శీతాకాలం సీజన్లో డెంగ్యూ, మలేరియా అంటూ అంటువ్యాధులు ప్రభలవచ్చని ఆందోళన చెందుతున్నారు. దోమల బెడద వలన షాపులో ఒక గంట అయినా కూర్చోలేకపోతున్నామని అంటున్నారు.ఈ ప్రాంతంలో ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. ఎక్కువమంది పిల్లలు పెద్దలతో జనాభా రాకపోకలు కొనసాగిస్తుంటారు. డ్రైనేజీ నిర్మాణం త్వరగా పూర్తిచేసి వ్యాపారాలు కొనసాగించడానికి అవకాశం కల్పించాలని వ్యాపారస్తులు కోరుతున్నారు.

# విధులు బహిష్కరించి న్యాయవాదుల ధర్నా



**నర్సాపురం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ భూహక్కు ల చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ నరసాపురం న్యాయవాదులు చేపట్టిన నిరసన శుక్రవారం కూడా జరిగింది.ప్రజా వ్యతిరేక ఆంధ్రప్రదేశ్ భూహక్కు ల చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు.ఈసందర్భంగా బార్ అసోసియేషన్ నాయకులు చల్లా దానయ్య నాయుడు, పుప్పాల వెంకట కృష్ణారావు, జె.సైమన్ విజయ్ కుమార్, వైదాని నాగేశ్వరరావు, నెక్కంటి క్రాంతి కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టం వల్ల ప్రజల రాజ్యాంగ బద్ధమైన, చట్టబద్ధమైన భూమి హక్కులకు తీవ్ర విఘాతం కలుగజేస్తుందన్నారు.

ఇప్పటికే అమలులో ఉన్న ఆస్తిబదలాయింపు చట్టం,రిజిస్ట్రేషన్ చట్టం, ఇండియన్ స్టాంప్ చట్టం, లిమిటేషన్ చట్టం, ఈజ్ మెంట్ చట్టం, ఆంధ్రప్రదేశ్ భూ కేటాయింపు చట్టం, పట్టాదార్ పాస్ బుక్ చట్టం, సర్వే, హద్దుల చట్టం వంటి పలు చట్టాల ద్వారా ప్రజలు తమ ఆస్తులను కాపాడుకుంటున్నారని తెలిపారు. ఈ చట్టం వల్ల రాజకీయ ప్రలోభాలు పెరిగి సామాన్య ప్రజల స్థిరాస్తులకు సంబంధించిన హక్కులు దెబ్బ తింటాయన్నారు. అందువల్ల ఈ చట్టాన్ని రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చేగొండి బాలాజీ,దొంగ నరసింహరాజు, పూరెళ్ల శ్రీనివాస్,గన్నాబత్తుల మత్స్య వల్లభరావు, కొల్లి మాణిక్యాలరావు, కొప్పినీడి చిట్టి పద్మజ, పోలిశెట్టి నారాయణ స్వామి, నక్కా కుమార్ రత్నం, విన్నా సూర్య ప్రకాష్ , కురెళ్ళ దుర్గా అనూష, చల్లా జ్యోతి, కోపల్లె నాగ శిరీష, ధనాల ఛాముండేశ్వరి, రంపా పుల్లాజీ, దొంగ సుభాష్ బాబు,కురెళ్ళ సోమ శేఖర్, కొత్తపల్లి రమేష్, కోటిపల్లి శ్రీనివాస మూర్తి, కె.సుప్రియ, కటికిరెడ్డి కరుణ కుమార్, ముత్యాల వెంకటసుబ్బారావు, వంగల శ్రీ రంగనాథ సంపత్ కుమార్, బసవా నమశివాయ, మల్లాడి నాగరాజు, జి.ప్రవీణ్ కుమార్, న్యాయవాద గుమాస్తాల సంఘ నాయకుడు కర్రి హేమసుందర్,కామన వెంకటేశ్వరరావు, కురెళ్ళ పాండు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



**ముసునూరు, మేజర్ న్యూస్:** మామిడి పంటలలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని ఉద్యాన అధికారి కే జ్యోతి ప్రియాంక తెలిపారు. మండలంలోని కొర్లగుంట, తాళ్ళవల్లి గ్రామాలలోని మామిడి తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ మామిడి తోటల్లో జనవరి నెలలో తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతులను రైతులకు వివరించారు. బోరాన్ లోపం ఉన్న తోటల్లో పూత బాగా వచ్చిన ఫలదీకరణ సరిగ్గా జరగపోవడం వలన పిందెకట్టు సరిగ్గా ఉండదన్నారు. బోరాన్ లోపాన్ని సవరించి పిందెకట్టు పెంచడానికి పూమొగ్గలు బయటకు రాకముందు 2 గ్రా. ల బోరాక్స్ పౌడర్ ను ఒక లీటర్ నీటిలో కలిపి తోటలో పిసికారి చేయాలన్నారు. బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే మూడు గ్రాముల గంధం లేదా 2 మీ.లీ హెక్సాకొనజోల్ ను ఒక లీటర్ నీటిలో కలిపి పిసికారి చేయాలన్నారు. ఈ విధంగా రైతులు సస్యరక్షణ చర్యలు చేయడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన అధికారి జ్యోతి ప్రియాంక తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, సర్పంచ్ నక్కబోయిన సత్యనారాయణ, ఆర్బికే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## చట్ట వ్యతిరేక కార్యక్రమాల నిరోధంపై సమీక్ష



**భీమడోలు, మేజర్ న్యూస్ :** యువత కోడి పందాలు, పేకాట ,జూదాలు వంటి చెడు వ్యసనాలకు దూరంగా కుటుంబ సభ్యులతో ఆనందంగా సంక్రాంతి పండగ జరుపుకోవాలని భీమడోలు తహసిల్దార్ ఎం ఇందిరాగాంధీ కోరారు. రానున్న సంక్రాంతి పురస్కరించుకొని కోడి పందాలు ,ఇతర చట్ట విరుద్ధ కార్యక్రమాలను అరికట్టడంపై గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో తహసిల్దార్ శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ కోడిపందాలు పేకాట జూదం వంటి కార్యక్రమాలను ఆడటం చట్టరీత్యా నేరమని తెలిపారు. సంక్రాంతి పురస్కరించుకొని చట్టరీత్యా నేరం గా పరిగణించే కార్యక్రమాల అరికట్టేందుకు బాధ్యులైన అధికారులు ,సిబ్బంది తో తహసిల్దార్ సమీక్ష నిర్వహించారు గతంలో ఏర్పాటు చేసిన ,ప్రస్తుతం ఏర్పాటు జరగనున్న కోడిపందాల బరులను గుర్తించి సంబంధిత కార్యక్రమాల నిర్వహణకు అవకాశం గల స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని కోరారు . సంక్రాంతి పురస్కరించుకొని గతంలో పోలీసు బైండోవర్ కింద పేర్లు నమోదైన మండల పరిధిలోని సుమారు 1600 మందికి దశలవారీగా కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.కార్యక్రమంలో భీమడోలు ఎస్సై చావా సురేష్ ,డిప్యూటీ తహసిల్దార్ షంషుద్దీన్ పాల్గొన్నారు.

## హెల్మెట్ ధారణ పై అవగాహన



**భీమడోలు, మేజర్ న్యూస్. :** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధారణ చేసి ప్రమాదాల నుంచి రక్షణ పొందాలని భీమడోలు ఎస్సై చావా సురేష్ కోరారు. జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం ఎస్సై మోటార్ వాహనాలను తనిఖీ చేస్తుండగా పలువురు ద్విచక్ర మోటార్ వాహనదారులు హెల్మెట్లు లేకుండా ప్రయాణం చేయటం గమనించారు. వారందరినీ ఒక చోట సమావేశపరిచి హెల్మెట్ ధారణ అవసరం, మోటార్ వాహన చట్టం నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాద బాధితులలో 60 శాతం వరకు బాధితులు చనిపోతున్నారన్నారు. వీరిలో అధిక శాతం హెల్మెట్ ధారణ చేయని ద్విచక్ర మోటార్ వాహన దారులని పేర్కొన్నారు. ఇదే క్రమంలో మోటార్ వాహన చట్టం మేరకు ద్విచక్ర మోటర్ వాహనదారులు హెల్మెట్ ధారణ చేయకుండా ప్రయాణిస్తే శిక్షార్హులని పేర్కొన్నారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని ద్విచక్ర మోటార్ వాహనదారులు హెల్మెట్ ధారణ చేసి సుఖ ప్రయాణాలు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

## చిన్న వెంకన్న గ్రామోత్సవం



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన చిన్న వెంకన్న ఉదయ దేవేరులతో కలిసి వాహనంపై శుక్రవారం పురవీ ధుల్లో అట్టహాసంగా ఊరేగారు.ధనుర్మాస ఉత్సవాలు పురస్కరించుకొని జరిగిన ఈ సేవ భక్తులకు నేత్రపర్వంమైంది. ముందుగా ఆలయంలో వాహనంపై స్వామి అమ్మవార్లు గోదాదేవి ఉత్సవ మూర్తులను నుంచి ఆలయ అర్చకులు ప్రత్యేక అలంకారాలు చేశారు.ఆ తర్వాత హారతులు సమర్పించి, భక్తుల గోవిందనామ స్మరణలు, మేళతాళాలు,మంగళ వాయిద్యాల, అశ్వము,గజసేవల నడుమ ఆలయ ప్రధాన గోపురము మీదుగా శ్రీవారి వాహనం తిరువీధులకు పయన మైంది. అనంతరం స్థానిక ధనుర్మాసం మండపంలో శ్రీవారు అమ్మవార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు.ఆ తర్వాత భక్తజనులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.